www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 జులై 2024



చేనేత రంగానికి కేటాయింపులు తగ్గించడం బాధాకరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర బడ్జెట్‌లో ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్న చేనేత రంగానికి కేవలం రూ.200 కోట్లే కేటాయించడం బాధాకరమని ఇండియన్ ప్రజా నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐపిసిపి) రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీర భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్న రంగం చేనేత రంగమని, భారతదేశ స్వతంత్ర పోరాటంలో కీలక ఘట్టమైన విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో చేనేత రంగం కీలక పాత్ర పోషించిందని, గత 2015 ఆగస్టు 7న ప్రధాని నరేంద్ర మోడీ చేనేత దినోత్సవాన్ని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారన్నారు. ఇప్పటి వరకు కేంద్ర వార్షిక బడ్జెట్లో రూ.200 కోట్లకు మించి పెట్టకపోవడంతో నేత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2024 బడ్జెట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా రూ.200 కోట్లు మాత్రమే చేనేత రంగానికి కేటాయించడం చేనేత వర్గాలను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వాలు మారిన చేనేత కార్మికుల బతుకులు మారలేదని, చేనేత రంగానికి ప్రాధాన్యతనివ్వకపోవడం శోచనీయమన్నారు. గత పదేళ్లలో నేత కార్మికులు ఆకలితో ఆత్మహత్యలు చేసుకున్న పట్టించుకొన్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దర్యాప్తు వేగవంతం

- పోటెత్తిన అర్జీదారులు
- న్యాయం జరుగుతుందనే ఆశతో నిరీక్షణ
- ఏళ్ల తరబడి సమస్యలతో అల్లాడుతున్నామని ఆవేదన
- కబ్జాదారుల నుంచి భూములను కాపాడాలని అభ్యర్థనలు
- జోరువానలోనూ అర్జీలు స్వీకరించిన స్పెషల్ సిఎస్ సిసోడియా, కలెక్టర్



వర్షంలోనూ అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేక సిఎస్ సిసోడియా



సబ్ కలెక్టర్ కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతైన ఘటన సందర్భంగా పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. పెద్ద ఎత్తున భూ కుంభ కోణాలకు పాల్పడిన వారు రికార్డులను మాయం చేసే క్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తగలబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించారు. తన హెలికాప్టర్లో రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లను హుటాహుటిన మదనపల్లెకి పంపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కార్యాలయాన్ని పరిశీలించిన డిజిపి, సిఐడి చీఫ్‌లు కార్యాలయాన్ని ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారని, ఇందులో కుట్రకోణం దాగి ఉందని నిర్ధారణ చేశారు. అప్పటినుంచి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ పరిధిలో ఉన్న 11 మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో రికార్డుల పరిశీలనను వేగవంతం చేశారు. వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర స్థాయి అధికారులు మదనపల్లెకు వచ్చి క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మూడు రోజులుగా రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే మకాం వేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో గత మూడేళ్ల కాలంలో భూ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాదితులు, భూములు కోల్పోయిన వారు, మరే ఇతర కారణాల వల్ల భూ వివాదాల్లో తలమునకలై ఇబ్బందులు పడుతున్న వారు తమ అర్జీలను సమర్పించాల్సిందిగా రెవెన్యూ శాఖ పిలుపునిచ్చింది. ఈ పిలుపు అందుకున్న వందల మంది బాధితులు గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి పోటెత్తారు. సరిగ్గా నాలుగు గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయం గేట్లు తెరవడంతో ఒక్కసారిగా లోపలికి పరుగులు పెట్టారు. ఇదే సమయంలో జోరువాన కురవడంతో అర్జీదారులు వెనుకడుగు వేయలేదు. తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో వర్షంలో సైతం తమ సమస్యలను పెద్ద అధికారికి విన్నవించుకోవడానికి పోటీపడ్డారు. అర్జీదారులను ఏమాత్రం నిరాశపరచకుండా సిసోడియా సైతం బయటకు వచ్చి జోరు వానలోనూ అర్జీదారులు, ప్రజల నుంచి సిసోడియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీలోనూ ఫోన్ నెంబర్ రాసి అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా నలిగిపోతున్నాం, ఇప్పటికైనా మా సమస్యకు పరిష్కారం దొరుకుందని ఆశగా ఉన్నామని ఎంతో ఆశగా చెప్పడం వారి ఆవేదనను తెలియజేస్తోంది.

ఘటనపై సమీక్షించిన సిఐడి చీఫ్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో దర్యాప్తు వేగవంతంగా జరుగుతోంది. ఎపి సిఐడి చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ గురువారం మదనపల్లెకు చేరుకున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ్యాన్ని పరిశీలించారు. కేసు పురోగతిపై ఆయన సమీక్షించారు.


కొన్న భూమిలో అరచకాలు సృష్టిస్తున్నారు



సిటిఎం వద్ద 810 సర్వే నెంబర్‌లో ఎకరా పొలాన్ని కొన్నాం. కొన్నప్పటి నుంచి వైసిపి సర్పంచ్‌లు ఆక్రమించుకునేందుకు రూ.లక్షల ఖర్చు పెట్టి వేసిన ఫెన్సింగ్‌ను కూల్చేశారు. మా స్థలాన్ని శ్మశాన వాటికగా మార్చేసి అందులో చనిపోయిన వారిని పూడ్చి పెట్టారు. వైసిపి నాయకుల అరచకాలకు అధికారులు వంత పాడారు. ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని వచ్చాను.

- యేసువర్ధన్, మదనపల్లె.

డికెటి భూమిని ఆక్రమించారు



మా నాన్న మల్లప్పకు వలసపల్లి వద్ద 1986లో 2.73 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం డికెటి పట్టా వచ్చింది. అందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేసు న్నాం. నేను వికలాంగుడిని. ఆరు నెలల క్రితం వైసిపి నాయకుడు మాధవరెడ్డి మా భూమికి కంచె వేసి అందు లోనికి రానివ్వకుండా భయభ్రాంతులనకు గురిచేస్తు న్నాడు. నాకు న్యాయం జరుగుతుందని వచ్చాను

- భాస్కర్, వలసపల్లి.

సెంటున్నర స్థలాన్ని వదల్లేదు



నాకు 2014లో జన్మభూమి ప్రోగ్రామ్‌లో ఇంటి నిర్మాణం కోసం సెంటున్నర స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలంలో ఇళ్లు కట్టుకోనివ్వకుండా తంబళ్లపల్లె వైసిపి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధికారుల ద్వారా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాడు. నా ఇంటిని పడేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నందుకు నాపై అక్రమంగా మూడు కేసులు పెట్టారు. ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని ఆశగా వచ్చాను.

- సునీత, ములకలచెరువు.

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె/అర్బన్

రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా అధికారులకు సూచించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన సందర్భంగా మదనపల్లెకు విచ్చేసిన సిసోడియా, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి, సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్‌లతో కలిసి గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై మూడు జిల్లాల ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రెవెన్యూ రికార్డుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రాబోయే రోజులలో ఏ రకమైన అవకతవకలకు పాల్పడకుండా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పక్కాగా రికార్డులు మెయింటినెన్స్ చేయాలన్నారు. 20ఏళ్ల అనుభవం పూర్తి కాకముందే ఎక్కడ కూడా డి.పట్టా ఇవ్వకూడదని ఇలాంటి కేసులు ఏవైనా ఉన్నట్లయితే సర్వే చేయించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి సమస్య పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రెవెన్యూ అంశాలలో పూర్తి అవగాహన బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు, 22(ఎ) భూ సమస్యలు, 2020-23 సంవత్సరంలో జరిగిన పట్టా భూముల వివరాలు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు కన్వర్షన్ చేయుట, చుక్కల భూముల సమస్యలు, అసైన్మెంట్ భూముల వివరాలు, తదితర అంశాలపై డివిజన్ల వారీగా ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో చర్చించారు. కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, జిల్లాల ఆర్‌డిఒలు, తహశీల్దారులు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలి : స్టెప్ సిఇఒ



స్టెప్ సిఇఒ సాయిగ్రేస్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులు అందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉమ్మడి జిల్లా సెప్ట్ సిఇఒ సి.సాయి గ్రేస్ పేర్కొన్నారు. శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ అంకితభావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలలలో నిర్ధారించుకొని తరగతి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో అభ్యసించాలని, లక్ష్యసాధనలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం నుంచి ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, చదివే వయసులో మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు బానిస కాకుండా అనుకున్న లక్ష్యాన్ని అధిగమించాలని తెలియజేశారు. ప్రముఖ కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్ వై. భాస్కర్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ అంశాలతో పాటు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాలపై పట్టు సాధించి కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు. సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సు కోసం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతోమంది సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ప్రభుత్వ , ప్రయివేట్, అఖిల భారత సర్వీసులలో అత్యున్నత హోదాలో స్థిరపడ్డారని, యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్, ప్రతిభ అవార్డులు సాధించారని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను తీర్చే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి, ప్రయోగశాలలకు అధిక ప్రాముఖ్యతను కల్పించే నాక్, అటానమస్ హోదా అతి త్వరలో తమ కళాశాలకు రానుందని వివరించారు. దీనికి అనుగుణంగా మొదటి సంవత్సరం నుంచి కోడింగ్, అర్థమెటిక్, లాజికల్, ప్రోగ్రామింగ్ విభాగాలలలో ప్రత్యేక శిక్షణ, వనరులు కల్పిస్తున్నామని తెలియజేశారు. మార్కుల కోసం కాకుండా తరగతి అంశాలపై పూర్తిస్థాయిలో విషయ పరిజ్ఞానాన్ని విపులంగా బోధించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని వివరించారు. కళాశాలలో వివిధ విభాగాలలో అత్యధిక నైపుణ్యం, సుదీర్ఘ బోధన అనుభవం కలిగిన అధ్యాపకుల సహకారంతో ప్రతి సెమిస్టర్‌లో యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని తెలియజేశారు. తమ కళాశాల వివిధ శిక్షణ సంస్థలతో ఎంఒయు ఏర్పరచుకుని 100 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి సంవత్సరం అపేక్ష లాంటి టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్, సింపోజియం ద్వారా విద్యార్థుల నైపుణ్యతను, సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఇతర సామాజిక కార్యక్రమాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాలలో విద్యార్థులు వివిధ సందర్భాలలో సాధించిన అకాడమిక్ ప్రతిభా పాటవాలను సాంస్కృతిక ప్రదర్శనల చిత్రమాలికను ప్రదర్శించారు. ఓరియంటేషన్ కార్యక్రమంలో అతిథులను సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్టి



సమావేశంలో మాట్లాడుతున్న చిష్టి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రపంచంలోని ప్రజాతంత్ర వాదులందరూ పాలాస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్టి పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గురువారం జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు టి.హరిశర్మ అధ్యక్షతన రాయచోటిలో సిఐటియు జిల్లా కార్యాలయంలో 'పాలస్తీనా సంఘీభావ సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఎ.చిష్టి మాట్లాడుఊత 1948కి ముందు ప్రపంచపటంలో అసలు ఇజ్రాయిల్ అనే దేశం లేదని, తలదాచుకోవడానికి స్థలం అంటూ ప్రవేశించి క్రమంగా ఆదేశాన్ని ఆక్రమించడం తీవ్ర దోహమన్నారు. చిన్న కారణాలు చూపి యుద్ధం మొదలుపెట్టి అక్కడి మహిళలు, పిల్లలు వృద్ధులు అనే తేడా లేకుండా విచక్షణ మరచి, పాఠశాలలు, ఆసుపత్రులు, ఆలయాలన్నింటిపైనా యుద్ధం చేయడాన్ని వ్యతిరేకించారు. అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి అమెరికా వత్తాసుతో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను మానవతా వాదులం దరూ ఖండించాలని కోరారు. ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయలలో పాలస్తీ నాకు అనుకూలంగా సాగుతున్న సంఘీభావ ప్రదర్శనలను కొనియాడారు. మన దేశంలో ఇలాంటి సంఘీభావ కార్యక్రమాలు మరిన్ని జరపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఐక్యరాజ సమితి కఠిన చర్యలు తీసుకొని గతంలో అంగీకరించిన విధంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సదస్సులో ముస్లిం హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు ముల్లా ఇందాదుల్లా మాట్లాడుతూ మానవత్వం చూపిన పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ క్రూరమైన దాడులు చేసి అందరినీ చంపడం, దానికి అమెరికా సహకరించడం దారుణమని వాపోయారు. అమెరికా తన వాణిజ్య అవసరాలకు యుద్ధం కొనసాగాలని కోరుకూంటుందని, ఇజ్రాయిల్‌కు ఆయుధ సామగ్రి అమ్మి సొమ్ము చేసుకుంటుందని పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధమైనా మరే ఇతర యుద్ధమైనా మానవజాతికి ముప్పుతెస్తుందని, అందువల్ల యుద్ధాన్ని ఆపి ప్రపంచశాంతి కాపాడాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇజ్రాయిల్‌ను భారత ప్రధాని మోడి సమర్థించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కుల, మత, భాషా బేధం లేకుండా మానవులు కలసి ఉండటాన్ని కేంద్ర ప్రభుత్వం చూడలేదని, అందరినీ విడదీయటమే బిజెపి సిద్ధాంతమని చెప్పారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కెవిపిఎస్ నాయకులు వెంకటయ్య ,మాధవయ్య, ముస్లిం హక్కుల పోరాట సంఘం నాయకులు ఖాదర్‌బాషా, సాహుల్ హమీద్ మస్తాన్ వలి, యూసఫ్, అశ్రఫ్ మహ్మద్ అలీ అమీర్జాన్, ఫిర్దోస్, ప్రజలు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ విద్యారంగా సమస్యలు వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా, ప్రధాన కార్యదర్శులు షేక్. జాబీర్, బి.హరి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వారు డిఇఒ శివప్రకాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 117 రద్దుచేసి, జీవో 53 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ప్రీ ప్రైమరీ తోపాటు 1-5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు లేదా ఉర్దూ, ఇంగ్లీషు మీడియాలను సమాంతరంగా నడపాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, ఉన్నత పాఠశాలలో బోధనేతర సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. కిలోమీటరు పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో పోస్టు అప్ గ్రేడ్ చేసి, ప్రమోషన్లు ఇవ్వాలని, బదిలీలు జరపాలని, మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్లకు 010 హెడ్ ద్వారా జీతాలు ఇప్పటికీ అమలు చేయాలి, వారి సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి, కెజిబివి పాఠశాలల్లో ప్లస్-2 తరగతులకు ఇంగ్లీషు, తెలుగు బోధించేందుకు వీలు లేకుండా తొలగించిన టీచర్లను కోర్టు ఉత్తర్వుల ప్రకారం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి విద్యారంగంపై దృష్టి సారించి పరిస్థితులను చక్కదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) విజ్ఞప్తి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి. చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి దావుద్దీన్, ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజా రమేష్, వీరబల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగర్జున, అమీనుల్లా, చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి ఆదిల్, లక్కిరెడ్డిపల్లె మండలం ప్రధాన కార్యదర్ రఖీబ్, గుర్రంకొండ మండల నాయకులు నర్సింహారెడ్డి, పెద్దమండెం మండల యుటిఎఫ్ నాయకులు చలపతి, కె.వి పల్లె మండలం ప్రధాన కార్యదర్శి అనిరుద్రయ్య పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై ఐజి తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



రికార్డులు పరిశీలిస్తున్న ఐజి సరోజ

మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి సరోజ తనిఖీ చేశారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఆదివారం అర్ధరాత్రి ఫైళ్ల దహనం ఘటన సంచలనం రేకెత్తించడం తెలిసిందే. ఘటనకు సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై ఐజి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నివేదికలను సేకరించారు.

27న సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు అవగాహన కలిగి ఉండాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఎఐఎల్‌యు) మదనపల్లె కమిటీ నాయకులు పి.వి.ప్రసాద్, ఎస్.షాజహాన్, కె.సోమశేఖర్, శ్రీనివాసులు, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు టి.హరిశర్మ, పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు మదనపల్లె పట్టణం ఎన్‌జిఒ హోంలో ఐలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) రాష్ట్ర కోశాధికారి ఎస్.రమేష్ బాబు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సులో న్యాయవాదులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు సంయుక్తముగా మొబిలిటీ, స్మార్ట్ సిటీలలో కృత్రిమ మేధస్సు పాత్రపై వర్‌షాప్‌ను కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ వారు మూడు రోజుల పాటు కలశాలలోని ఇతర కళాశాలకు చెందిన విద్యార్థులకు, అధ్యాపకులకు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.వి.ఆర్ రవిశంకర్, సివిల్ ప్రొఫసర్, నేషనల్ ఇన్నిట్యూట్ అఫ్ టెక్నాలజీ, వరంగల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ సిటీలలో మొబిలిటీ అనేది ప్రపంచవ్యాప్తంగా పట్టణ ప్రకృతి దృశ్యాలను పునర్నిర్మించే కీలకమైన అంశం అని, వేగవంతమైన పట్టణీకరణతో వచ్చే ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం మరియు అసమర్థరవాణా వ్యవస్థలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొం టున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, కో-ఆర్డినేటర్స్ డాక్టర్ సుదీర్ కుమార్, అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్



తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సిఐ పులిశేఖర్

రికార్డులను అధికారుల సంరక్షణలో ఉంచుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమైన రికార్డులను అధికారుల సంరక్షణలోనే ఉంచుకోవాలని వాల్మీకిపురం సిఐ పులిశేఖర్ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయాల్లోని రికార్డు రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాద సంఘటన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పలు కార్యాలయాల్లో రికార్డు రూమ్‌లను తనిఖీ చేసి, ముఖ్యమైన రికార్డులను సీజ్ చేసి విచారిస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి అనుమతి లేకుండా ఎవ్వరినీ అనుమతించకూడదన్నారు. కార్యాలయాల లోపల, బయట సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, సీఐ పులిశేఖర్ 9440796714, ఎస్ఐ నాగేశ్వరరావు 9440900712లకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఖాతిజున్ కుఫ్రా, డిప్యూటీ తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సబ్ రిజిస్ట్రార్ స్వరూప్ కుమార్, సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'కో-ఆపరేటివ్ బ్యాంకుకు వందేళ్లు'

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఏర్పాటు చేసి వందేళ్లు అయిందని విభాగ సహకార శాఖ అధికారి రవిచంద్రన్, ముఖ్య కార్యనిర్వాహాధికారి పివి ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని టౌన్ బ్యాంక్ ముఖ్య కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వందేళ్ళ బ్యాంకు ఏర్పాటు, ఆర్థిక లావాదేవీలు, డిపాజిట్లు, ఖాతాదారులు, బ్యాంకు టర్నోవర్, ఇన్కమ్ టాక్స్ చెల్లింపు, ఖాతాదారుల రుణములు గురించి తెలియజేశారు. మదనపల్లి టౌన్ బ్యాంకును 1924 జూన్ 24న స్వర్గీయ గంగారపు పెద్దప్పరెడ్డి స్థాపించారన్నారు. అప్పటి బ్రిటిష్ పాలనలో ఉన్న సహకార చట్టముల ప్రకారం ఈ బ్యాంకు స్థాపించినట్లు పేర్కొన్నారు. 1987లో ఎస్‌బిఐ ద్వారా బ్యాంకింగ్ లైసెన్స్ అనుమతి పొందిందన్నారు. 1957లో అప్పటి సిఎం డాక్టర్ నీలం సంజీవరెడ్డి బ్యాంకు భవనాన్ని ప్రారంభోత్సవం చేయడం జరిగిందన్నారు. రూ.410 షేరు ధనముతో అప్పటిలో 30 మంది సభ్యులతో ఈ బ్యాంకు ప్రారంభించగా ప్రస్తుతం ఏ క్లాస్ సభ్యులు 3441 మంది ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలి బ్యాంకుగా, రాయలసీమలో రెండవ బ్యాంకుగా మదనపల్లి టౌన్ బ్యాంకు రికార్డు సృష్టించిందని తెలిపారు. బ్యాంకు డిపాజిట్లు ఇప్పటివరకు రూ 76 కోట్లకు చేరిందని చెప్పారు. కరోనా సమయంలో బ్యాంకు రుణాలను ఆన్ లైన్ ద్వారా అందించి తోడ్పాటు ఇచ్చినట్లు పేర్కొన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా పాలకవర్గం లేనప్పటికీ బ్యాంక్ పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డి, ఎం శ్యాంప్రకాష్‌రెడ్డి, రవిచంద్రన్ సహకారంతో బ్యాంకు కార్యకలాపాలు దిగ్విజయంగా సాగించినట్లు తెలిపారు. త్వరలోనే పాలకవర్గం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినిపించామన్నారు. ఎమ్మెల్యే పాలకవర్గం ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు వ్యక్తపరిచారు. చెక్ ట్రాన్సాక్షన్ సిస్ట రాష్ట్రంలోనే తొలిసారిగా మదనపల్లి టౌన్ బ్యాంకులో ప్రారంభించినట్లు చెప్పారు. ఎటిఎంలను స్థాపించి ప్రజలకు సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. త్వరలోనే వందేళ్ళ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుల

కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా మంజుల

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ కె.మంజుల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సమన్వయకర్త డాక్టర్ జిఎస్ పాండురంగ తిరుపతి వ్యవసాయ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు. డాక్టర్ మంజుల మొదటిగా వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురం నందు సైంటిస్టు (ఎంటమాలజీ)గా 1999 నుంచి 2003 వరకు నాలుగేళ్లు నిర్వర్తించారు. అనంతరం వెంకటేశ్వర వ్యవ సాయ కళాశాలలో 2003 నుంచి 2018 వరకు, 2020 నుంచి 2024 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గాను, అసోసియేట్ ప్రొఫెసర్ గాను, ప్రొఫెసర్ గాను, ప్రొఫెసర్ అండ్ హెడ్ గాను 19 సంవత్సరాలు బాధ్యతలు నిర్వర్తించారు. 2018 నుంచి 2020 మధ్య ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతిలో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి, వ్యవసాయ విద్యను అభ్యసించి, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పని చేయడం తన అదృష్టంగా భావి స్తున్నానని తెలిపారు. కెవికె సిబ్బంది సహకారంతో రైతులకు చిత్తశుద్ధితో సేవలందిస్తానని పేర్కొన్నారు.

రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వ్యవసాయం కార్పొరేట్ల పరం కాకుండా వ్యవసాయంలో రైతన్నను నిలపాలని, శక్తివంతమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29,30,31 తేదీలలో మదనపల్లెలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పిటిఎం రోడ్డులో రైతు సమ్మేళనాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశా రు. ఈ సందర్భంగా టి.కృష్ణప్ప,సిపిఐ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డిలు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటిపోతున్నా మన దేశంలో రైతు గౌరవప్రదంగా జీవించగలిగే పరిస్థితులు లేవని అన్నారు. పాలకుల విధానాల కారణంగా రైతులు, కౌలు రైతులు, గ్రామీణ చేతివృత్తి దారుల స్థితి గతులు రోజు రోజుకూ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో సిపిఐ మండల నాయకులు ఎం.అష్రఫ్‌అల్లి, జి.రఘునాథ్, పి.నారా యణ స్వామి, ఎస్.తంబయ్యశెట్టి, ఉత్తన్న రామచంద్ర, రియాజ్, హబీబ్ పాల్గొన్నారు.

డీలర్ తల్లి మృతికి ప్రముఖుల నివాళి

ప్రజాశక్తి-గాలివీడు


నాగరత్నమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాహుల్ రెడ్డి

మండల పరిధిలోని చిలకలూరిపేటకు చెందిన డీలర్ పాకాల రవి తల్లి పాకాల నాగ రత్నమ్మ అనా రోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆమె భౌతి కాయాన్ని మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నారా యణరెడ్డి కుమారుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు , ఇద్దరు కుమార్తెలు, మనువళ్లు, మనవరాలు ఉన్నారని అన్నారు. మాజీ ఎంపిటిసి రెడ్డి ప్రసా ద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, లక్కిరెడ్డిపల్లి మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేడియం లక్ష్మయ్య, శేఖర్‌రెడ్డి, మల్‌రెడ్డి కొండ్రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మీటే నాయక్, టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

నేడు హార్టీ సెట్-2024

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం హార్టిసెట్-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష కోసం 67 మంది రిజిస్టర్ చేసుకున్నారన్నారు. హాల్ టికెట్ అందనివారు కళాశాలలో తమ గుర్తింపు కార్డును చూపించి డూప్లికేట్ పొంద వచ్చన్నారు. ఉద్యాన పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు బిఎస్‌సి ఉద్యాన కోర్సులో చేరటానికి ఈ అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత పరీక్షకు హాజరయ్యేవారు నిర్ణీత సమయం కన్నా అర గంట ముందే పరీక్ష కేంద్రం చేరుకోవాలనిసూచించారు. వివరాలకోసం కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ఆఫీసర్ ఎం.జయప్రదను సంప్రదించాలన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-కలకడ

పాఠశాలకు క్రీడా సామగ్రిని వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు చంగల్ రాయుడు తెలిపారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.15 వేలు విలువైన క్రీడా సామగ్రిని బెంగళూరుకు చెందిన సిబ్బాల రవీంద్ర దంపతులు పాఠశాలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మోడెమ్. చెంగల్ రాయుడు ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తుంటారని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆయన అభ్యర్థన మేరకు పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో కోన మాజీ సర్పంచ్ త్యాగరాజు, ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగముని నాయక్, రమేష్ కుమార్ రెడ్డి, రెడ్డప్ప, షౌకత్ అలి, గఫార్ ఖాన్, సైరా బాను, నౌషాద్ బేగం, ఝాన్సీ రాణి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు హక్కు పత్రం తప్పనిసరి : జెడి

ప్రజాశక్తి-రామాపురం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

భూమి లేని రైతులు భూమిని రైతు దగ్గర కౌలు తీసుకొని పంట సాగు హక్కు పత్రాన్ని పొంది ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. అనంతరం రైతు సేవ కేంద్రంలో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రం పొంది ఉంటే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎం కిసాన్ పథకాల రికార్డులను పరిశీలించి ఇకెవైసి పూర్తి చేయాలని సూచించారు. రైతు సేవ కేంద్రాలు సిబ్బంది ఎప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆయన ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన పంటలను పంటలను పరిశీలించారు. రైతులకు లింగ ఆర్షక బుట్టల పచ్చ పల్లాల ఆవశ్యకతను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులను పెంచాలని పెంచడంతోపాటు వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి


గాలివీడు :ఎగువపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగుకాలువ

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు పట్టణంలో డ్రెయినేజీ సమస్య అధికంగా ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న అరకొర డ్రెయినేజీ కాలువల్లో మురుగునీరు సరిగ్గా ప్రవహించక రోడ్డుపై వచ్చి చేరు తుండటంతో దుర్గంధం వెదజల్లు తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎగువపల్లి మురుగు కాలువ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే ప్రధాన రహ దారి గుండా రోడ్డుకు ఇరు వైపులా మురుగు కాలువ నిర్మించారు. అక్కడ నుంచి మురుగునీరు రోడ్డుపై చేరుతుండటంతో ఇబ్బంది కరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి-రామాపురం : మండల పరిధిలోని నీలకంఠరావుపేటలో పాఠశాల చుట్టూ ఉన్న వ్యర్థాలు, చెత్తా చెదారంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయయులు పేర్కొన్నారు. చెత్త నుంచి దుర్వాసన వస్తుం డటంతో పాఠశాల గదుల్లో ఉండడానికే ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం చేయాలన్న విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. పాఠశాల చుట్టూ నివాసమున్న వారు వ్యర్థ పదా ర్థాలకు పాఠశాల ఆవరణం లో వేయకుండా కట్టడి చేయాలని కోరారు. గతం లో సచివాలయంలోనే గ్రీన్ అంబాసిడర్ వారీగా తొలగించే వారిని ప్రస్తుతం వారికి జీతాలు ఇవ్వకపోవడంతో వారు విధులకు హాజరు కాకపోవడంతో వ్యర్థ పదార్థాలు పెరిగిపోయాని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుకుంటున్నారు.


పాఠశాల ఎదురుగా పేరుకుపోయిన చెత్తా చెదారం

పంచాయతీ అనుమతి లేకుంటే జరిమానా


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇఒ గురుమోహన్

ప్రజాశక్తి-పీలేరు

గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే జరిమానా తప్పదని పీలేరు ఇన్‌చార్జి ఇఒ గురు మోహన్ తెలిపారు. తమ సిబ్బందిని ఐదు సమూహాలుగా విభజించి అనుమతుల్లేని అక్రమ భవన నిర్మాణాలను, నీటి కుళాయిలను గుర్తించడానికి ఆదేశించినట్లు చెప్పారు. స్థానిక ప్రజలు పంచాయితీ అనుమతులు పొందాలని కోరుతూ తమ సిబ్బందితో చైతన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్థానికులు తమకు సహకరించి పంచాయతీ ఆదాయాభివృద్ధికి సహకరించాలని అన్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీ అనుమతులు పొందడం ద్వారా నీటి సమస్య కానీ, దారి సమ స్య కానీ, ప్రకృతి వైపరీత్యాల సంభవించినప్పుడుకానీ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. తమ హెచ్చ రికలను అనుసరించకుంటే అక్రమ నిర్మాణాలను, అనుమతులు లేని నీటి కొళాయిలను తక్షణం రద్దు చేయించి జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీకి చెల్లించాల్సిన పాత పన్నుల బకాయిలను క్రమ పద్ధతిలో ప్రజల నుంచి వసూలు చేసే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టామని ప్రజ లు కూడా పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా పీర్ల ఊరేగింపు

- భారీగా హాజరైన ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, ఈనెల 20వ తేదీ నుంచి పీర్ల పండుగ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 25న గురువారం తుమ్మరకుంట తుమ్మరకుంటవారిపల్లి, సామడపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, గజ్జలవారిపల్లి పీర్ల ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఊరేగింపుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.అదేవిధంగా 26వ తేదీ శుక్రవారం బండమీదపల్లి (ఎగువ,దిగువ), బురదవారిపల్లి పీర్ల ఊరేగింపు 27న అన్నదాన కార్యక్రమం, 28న పీర్ల జల్ది, 30న మంగళవారం మునాళ్ల శాస్త్రం అంగరంగ వైభవంగా జరుగునని నిర్వాహకులు తెలిపారు. పిటిఎం మండలం, నియోజకవర్గంలోని ప్రజలు పీర్ల పండుగ మహోత్సవానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.


పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

ప్రయాణికులతో డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-పీలేరు


మాట్లాడుతున్న డిఎం బండ్ల కుమార్

పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజరు బండ్ల కుమార్ గురువారం తన కార్యాలయంలో ప్రయాణికులతో నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు నుంచి నరేష్ అనే ప్రయాణికుడు మాట్లాడుతూ పీలేరు నుంచి యలహంక మీదుగా బెంగళూరుకు బస్సు నడపాలని కోరారు. అందుకు డిపో మేనేజర్ సమాధానం ఇస్తూ గతంలో పీలేరు నుంచి యలహంకకు బస్సు సర్వీసు ఉండేదని తగిన ఆదాయం రాకపోవడంతో ఆ సర్వీసును రద్దు చేయడం జరిగిందని అన్నారు. పురుషోత్తంరెడ్డి అనే మరో ప్రయాణికుడు కాల్ చేసి కలికిరి, కలకడ బస్టాండ్‌లో కంట్రోలర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే వారిని నియ మించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సమా ధానం ఇచ్చారు. రవీంద్రారెడ్డి అనే ఇంకో ప్రయా ణికుడు కాల్ చేసి, కలకడ బస్టాండులో మరుగుదొడ్లు లేని కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. స్పందించిన డిఎం త్వరలోనే కలకడ బస్టాం డులో మరుగుదొడ్ల నిర్మాణం చేపడు తామని సమాధానం చెప్పారు. పీలేరు పట్టణం నుంచి బెంగుళూరుకు సూపర్ లగ్జరీ సర్వీసు నడపాలని కిరణ్ అనే ప్రయాణికుడు కోరగా సూపర్ లగ్జరీ బస్సులు నడపడానికి పర్మిట్ కావాల్సి ఉంది, సూపర్ లగ్జరీ బస్సులు కూడా అందుబాటులో లేవని తెలిపారు.


రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలం

భూ ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పంచాయతీ ఇరిగేషన్ క్వాటర్స్ కింది భాగంలో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిని రెవెన్యూ అధికారులు అడ్డుకొని జెసిబిని వెనక్కి పంపించారు. సర్వేనెంబర్ 658 రెండో లెటర్లో రెండు ఎకరాల 41 సెంట్లు ప్రభు త్వ స్థలం ఉందని, 40 సంవత్సరాల నుంచి ఆ ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అక్ర మాలుగానీ, ఎటువంటి నిర్మాణాల గానీలేవు. ఖాళీగా ఉన్న స్థలంలో ఉన్నఫలంగా గురువారం జెసిబి యంత్రాన్ని ఉపయోగించి ఇక్కడ స్థలా న్ని ఆక్రమిస్తుండగా స్థానికులు డిటి తిమ్మారెడ్డి ఫిర్యాదు చేశారు. డిటి ఆదేశాల మేరకు విఆర్ఒ రవీంద్రారెడ్డి వెళ్లి ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న పనిని నిలుపుదల చేశారు. గతంలో ఇరిగేషన్ క్వాటర్స్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్రీడా మైదానంగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఆ స్థలాన్ని అలానే ఉంచారు. ఖాళీ స్థలాన్ని చదు వును చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకొని స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆధార్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కలిచర్ల రెవిన్యూ గ్రామ పరిధిలో జరుగు ఆధార్ సెంటర్‌ను ఎంపిడిఒ వెంకటరమణయ్య గురువారం తనిఖీ చెశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతే అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్‌లో ఉన్న తప్పులు సరి చేసు వచ్చుని, ఆధార్ లేని విద్యార్థులు ఆధార్ కార్డు తీసుకోవాలని పొందవచ్చని తెలిపారు. అనంతరం ఎన్ఒపల్లి పంచాయతీలోని కలిచర్ల పాతూరులో ఉర్దూ పాఠశాల మధ్యాహ్నబోజనం తనిఖీ చేశారు. మె నూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శిలు జనార్దన్, జగన్, ప్రసన్నలక్ష్మి, సూపర్‌వైజర్ నూర్జహాన్ బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోరుమామిళ్ల సుబ్బరాయుడు

కార్మికులకు పనికితగ్గ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి.తులసేంద్ర, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హార్సిలీహిల్స్‌లో రెండవ రోజు గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా తులసేంద్ర, సుబ్బారాయుడు మాట్లా డుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్, కాంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి పి.సుబ్బరాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ గౌడ్, రామచంద్రయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలు నేలపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలికను రక్షిద్దాం.. చదివిద్దాం : సిడిపిఒ

ప్రజాశక్తి-కలికిరి

బాలికను రక్షిద్దాం బాలికను చదివిద్దాం కార్యక్రమం పై రాజువారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో బాగంగా తల్లులకు అవ గాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సిడిపిఒ భారతి తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ తరపున అమలు చేయబడుతున్న వన్ స్టాప్ సెంటర్ గురించి వివరించారు. సమగ్ర బాలల పరిరక్షణ సంస్థ, శిశు గృహ, గృహ హింస చట్టం, బాల్యవి వాహాలపై నిషేదం, బాలికను రక్షిద్దాం-బాలికను చదివిద్దాం, అంశాల గురించి అంగన్వాడీ కార్యకర్తలకు తల్లులకు వివరించామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అరుంధతి, కలికిరి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీరువా వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట


బీరువాతో విఆర్ఒ

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలంలోని రెడ్డిపల్లి విఆర్ఒ రాధకి గురువారం రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రొంపిచర్ల ఆదినారాయణ జ్ఞాప కార్థంగా ఆయన తనయుడు రొంపిచర్ల మురళీ బీరువాను వితరణగా అందిం చారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యా లయంలో రికార్డులు కాలిపోయిన సందర్భంగా రికార్డులు భద్రపరుచుకోవడం కోసం బీరువా వితరణంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. పంచాయతీకి సంబంధించిన భూ రికార్డులు, పంచాయతీకి సంబంధించి పలు దస్తావేజులను భద్రపరచుకొనుటకు బీరువా ఉపయోగ పడుతుందని తెలిపారు. గ్రామ ప్రజల శ్రేయస్సు ముఖ్యమని, పంచాయతీ అభివృద్ధే ధ్యేయమని పేర్కొన్నారు.

స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తంబళ్లపల్లిలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు జరుగుతాయని తెలిపారు. అసక్తి కలిగిన 15 నుంచి 45లోపు వయసు కలిగిన బాలికలు, మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 1న దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. ఇతర వివరాలు కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఐ.చౌడయ్య 9618655759 నెంబర్ సంప్రదించాలని కోరారు.


విద్యార్థులకుపాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.అజంతుల్లా, ఎన్ఎస్ఎస్ పిఒ జి.రఘురామయ్య విద్యార్థులకు అందించారు. అధ్యాపకులు పాల్గొని మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, రమేష్ రాజు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళను చెట్టుకు కట్టేసి దాడి

కోడి గుడ్లతో కొట్టి, బ్లేడుతో కోసి చిత్రహింసలు

ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-వీరబల్లి/రాయచోటి

అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ షికారుపాలెంలో మహిళ అని కూడా చూడకుండా మానవత్వం లేకుండా చిత్రహింసలు పెట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల, పోలీసుల, కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండమ్మ అనే మహిళ (27) ఇతరులతో అక్రమ సంబంధం పెట్టుకుందన్న నెపంతో గ్రామస్తులు, వైసిపి నాయకులు చిత్ర హింసలు పెట్టారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళను కొట్టడంతో పాటు బ్లేడ్లతో కోశారు. ఆ తర్వాత వీధిలోని ఒక చెట్టుకు ఆమెను కట్టివేసి కోడిగుడ్లు, టమోటాలు, రాళ్లు, చెప్పులు, కర్రలతో కొట్టారు. ఆమెకు అంత జరుగుతున్నా చుట్టుపక్కల వాళ్లు చూస్తున్నారు తప్ప వచ్చి విడిపించాలనే కనీస బాధ్యత కూడా లేకుండా చోద్యం చూశారు. బంధువులు వెళ్లి విడిపించడానికి ప్రయత్నించగా మిమ్మల్ని ఇదే విధంగా కొడతామని బెదిరించడంతో వారు వెనుతిరిగారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు వెళ్లి సంఘటనా స్థలం వద్ద ఆమెను కొడుతున్న చూస్తున్నారు తప్ప విడిపించలేదు. అనంతరం కొందరు సహకారంతో వీరబల్లి పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ఫిర్యాదు తీసుకోకుండా ఎస్ఐ చంద్రమోహన్ తననే అసభ్యంగా మాట్లాడి ఇది మీకుల వ్యవహారం మీరే పరిష్కరించుకోవాలని చెప్పి కేసు పెట్టకుండా పంపారని బాధితురాలు వాపోయారు. అనంతరం చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె మాట్లాడుతూ తనను చిత్రహింసలు పెట్టారని తెలిపిన ఎస్ఐ ఎటువంటి చర్యలు తీసుకోకుండా పంపారని తెలిపారు. బాధితురాలును రాయచోటి గ్రామీణ సిఐ తులసీరామ్ పరిశీలించి బాధితరాలు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం ఏడుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృక్ష్మితం కాకుండా నిందితులపై కఠిన శిక్ష వేసేలా చూస్తామని చెప్పారు.